క్లుప్తంగా

మధ్యాహ్న భోజనం తనిఖీ



శ్యాంపురంలో మధ్యాహ్న భోజనం రుచి చూసి పరిశీలిస్తున్న ఎంఈవో దుర్గారావు

రాజాం: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు సక్రమంగా ఉండాలని ఎంఈవో యాగాటి దుర్గారావు సూచించారు. మండలంలోని శ్యాంపురం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం వంటకాలను ఆయన మంగళవారం రుచి చూసి పరిశీలించారు. భోజనం విషయంలో జాగ్రత్తలు పాటించాలని, రుచి, శుచి కలిగిన వంటకాలు చేయాలని సిబ్బందికి తెలిపారు. విద్యార్థుల హాజరుశాతం పెంచాలని హెచ్ఎంను కోరారు.

పోయిన బ్యాగు అందజేత



బాధిత మహిళకు బ్యాగు అందజేస్తున్న సీఐ అశోక్‌కుమార్ తదితరులు

రాజాం సిటీ: స్థానిక శాంతినగర్‌కు చెందిన రాయపురెడ్డి శ్వేత పోగొట్టుకున్న హ్యాండ్‌బ్యాగ్‌ను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆమెకు మంగళవారం అందజేశారు. వివరాలిలా ఉన్నాయి.. తన భర్తతో కలిసి గుయ్యానవలసలోని తమ బంధువుల ఇంటికి ఈ నెల 7వ తేదీన వెళ్లిన శ్వేత.. తన బ్యాగు ఎక్కడో రోడ్డుపై పడిపోయింది. కొంతదూరం వెళ్లిన తర్వాత ఈ విషయం గమనించి, వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది. పోయిన బ్యాగులో తులం బంగారం చైను, పావుతులం చెవి దుద్దులు, రూ.5 వేలు నగదు ఉన్నాయి. దీంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ కె.అశోక్‌కుమార్ స్పందించి, సిబ్బందిని అప్రమత్తం చేశారు. రామానుజులపేట దారిలో ఓ ఇంటికి ఉన్న సీసీ కెమెరాను పరిశీలించగా, ఆ బ్యాగు హౌంజరాంపేటకు చెందిన ఓ వ్యక్తికి దొరికినట్లు గుర్తించి, అతని వద్ద నుంచి బ్యాగును రికవరీ చేసి, బాధిత మహిళకు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న శ్రీనివాసరావు

బొబ్బిలి: మండల పరిధిలోని రామభద్రపురం చొక్కాపువాని చెరువు సమీపంలో మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో జర్నలిస్టు పితాని శ్రీనివాసరావుకు గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి.. సొంత పనుల నిమిత్తం స్నేహితుడితో కలిసి ద్విచక్ర వాహనంపై విజయనగరం వెళ్లిన ఆయన.. రాత్రి 9 గంటల సమయంలో తిరిగి వస్తుండగా చెరువు దాటిన తర్వాత ఉన్న గోతిలో అతడు తన వాహనంతో పడిపోయాడు. దీంతో గాయాలపాలైన అతడిని చికిత్స నిమిత్తం స్థానిక సీహెచ్‌సీకి తరలించారు.

డంపింగ్ యార్డు ఏర్పాటు



డంపింగ్ యార్డు చదును చేస్తున్న దృశ్యం

రేగిడి: మండలంలోని సంకిలి గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిలో తాత్కాలికంగా డంపింగ్ యార్డును మంగళవారం ఏర్పాటు చేశారు. సర్పంచ్ బుడుమూరు పట్టాభి ఆధ్వర్యంలో ఈవోపీఆర్‌డీవో సత్యనారాయణ, సచివాలయ ఉద్యోగులంతా స్థలం చూసి ఆ స్థలాన్ని ప్రొక్లెయినర్‌తో చదును చేయించారు. గ్రామ పరిశుభ్రత చర్యల్లో భాగంగా ఈ చర్యలు చేపట్టినట్లు సర్పంచ్ తెలిపారు.

ఒకేసారి పన్ను చెల్లిస్తే 5 శాతం రాయితీ



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి: మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి, ఆస్తి పన్నులను ఏకమొత్తంగా ఒకేసారి చెల్లిస్తే 5 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి తెలిపారు. ఇదే విషయమై స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ అడ్మిన్ సెక్రటరీలు, రెవెన్యూ అధికారులతో మంగళవారం ఆమె సమావేశమయ్యారు. పన్నుల చెల్లింపులో ఉన్న రాయితీలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

పింఛన్.. కటే!



- క్రమక్రమంగా తగ్గుతున్న సామాజిక పింఛన్లు
- అనర్హుల ఏరివేత పేరిట ప్రభుత్వం చర్యలు
- లబ్ధిదారుల్లో ఎవరి పెన్షన్ ఆగిందోనన్న టెన్షన్
- బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లో 3,147 పెన్షన్లు కట్

నియోజకవర్గాలు	గతంలో పింఛన్లు	ప్రస్తుత పింఛన్లు	తగ్గించిన పింఛన్లు
బొబ్బిలి	43,792	42,139	1,653
రాజాం	39,655	38,159	1,496

రామభద్రపురం: సామాజిక పింఛన్లలో కూటమి ప్రభుత్వం కోత విధిస్తోంది. అనర్హుల ఏరివేత పేరిట ప్రతినెలా పింఛన్లను తగ్గిస్తూ వస్తోంది. అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్ పెంచామని గొప్పగా చెప్పుకుంటున్న ఆ ప్రభుత్వమే ఇప్పుడు పింఛన్లపై వేటు వేస్తుండడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. అలా..కుడి చేతితో ఇచ్చి, ఇలా..ఎడమ చేతితో లాక్కోవడమంటే ఇదేనని విమర్శిస్తున్నారు. కొత్త పింఛన్లు ఇవ్వకుండా ఉన్న వాటిలో ఈ తొలగింపులు ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఉన్నపాటుగా పెన్షన్లు తొలగిస్తే ఎలా బతకాలని నిలదీస్తున్నారు. అయినా ఇవేమీ పట్టవన్నట్లుగా ప్రభుత్వం వ్యవహరిస్తుండడం విచారకరం.

ఒకటో తేదీ వచ్చిందంటే గుబులు..

బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లో ఇప్పటివరకు మొత్తం 3,147 పింఛన్లు తొలగించారు. గతేడాది ఏప్రిల్‌లో ఆయా నియోజకవర్గాల్లో మొత్తం 83,447 పింఛన్లు అందించగా, ఈ ఏడాది ఏప్రిల్‌లో 80,298 పింఛన్లు అందించారు. ఈ లెక్కన ఎన్ని పింఛన్లు తొలగించారో అర్థం చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో ఒకటో తేదీ వచ్చిందంటే చాలు.. ఎవరి పింఛన్ ఉంచారో.. ఎవరి పింఛన్ తొలగించారోనన్న ఆందోళన లబ్ధిదారుల్లో నెలకొంది. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే ఇప్పుడు కూడా ఉంటే తమకు ఈ బాధలేవీ ఉండకపోవచ్చని లబ్ధిదారులు అభిప్రాయపడుతున్నారు. పింఛన్ తప్పకుండా వస్తుందన్న భరోసాతో పాటు ఆరు నెలల్లో కొత్త పింఛన్లు ఇస్తారన్న ధైర్యం లబ్ధిదారుల్లో ఉండేది. అంతేకాకుండా ప్రతినెలా ఒకటో తేదీ వేకువజాము నుంచే వలంటీర్ల ద్వారా పింఛన్‌దారుల ఇంటి వద్దకే పింఛన్ అందించడం జరిగేది. ప్రస్తుతం వైఎస్సార్ సీపీ సానుభూతిపరుల పెన్షన్ల తొలగింపే లక్ష్యంగా చంద్రబాబు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మృతులవే తొలగిస్తున్నారు..



మృతి చెందిన వారి పెన్షన్లే తొలగిస్తున్నారు. అర్హులైన వారివి ఎవరివీ తొలగించడం లేదు. నవంబరు నెల నుంచి చనిపోయిన వారి భార్యలకు పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. కొత్త పింఛన్లకు ఇంకా అవకాశం ఇవ్వలేదు.

– రత్నం, ఎంపీడీవో, రామభద్రపురం

పేదల కడుపుకొట్టడమే..



పింఛన్లు తొలగించడమంటే.. పేదల కడుపుకొట్టడమే.. ఇప్పటివరకు కొత్త పింఛన్లు మంజూరు చేయలేదు. దీనికితోడు ఉన్న వాటిలోని కొన్నింటిని తీసేస్తున్నారు. అధికారంలోకి ఎలాగైనా రావాలనే ఆశతో లేనిపోని హామీలతో ప్రజలను ఊదరగొట్టారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత నయవంచన చేస్తున్నారు. సూపర్ సిక్స్ పథకాల అమలు ఊసే లేదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు ఇప్పుడిప్పుడే ప్రజలు అర్థం చేసుకుంటున్నారు.. వారిచ్చిన హామీలన్నీ బూటకపు హామీలేనని.

– శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, మాజీ ఎమ్మెల్యే, బొబ్బిలి

మీకో దండం.. గ్యాస్ ధరలు తగ్గించండి



బొబ్బిలి: కేంద్రానికి దండాలు పెడుతున్న సీపీఎం నాయకులు, మహిళలు

బొబ్బిలి: నిత్యావసరాల ధరలతో ప్రజలు సతమతమవుతున్న వేళ గ్యాస్ ధరల పెంపు దుర్మార్గమైన చర్య అని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పొట్నూరు శంకరరావు అన్నారు. వంటగ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ స్థానిక పట్టణంలోని 30వ వార్డులో ఆ వార్డు ప్రజలందరితో కలిసి మంగళవారం ఆందోళన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వాన్ని ఉద్దేశిస్తూ మీకో దండం.. గ్యాస్ ధరలు తగ్గించండి అని పొర్లుదండాలు పెట్టారు. మోదీ ప్రభుత్వం ఇప్పటికే పలుమార్లు గ్యాస్ ధరలు పెంచిందని, ఇప్పుడు మరోసారి ఒక్కో గ్యాస్‌బండపై రూ.50 పెంచిందని తెలిపారు. నిత్యావసర సరుకుల ధరలతో పాటు పెట్రోలు, డీజిలు, గ్యాస్ వంటి ఇంధన ధరలను కూడా అమాంతం పెంచేస్తూ ప్రజల నడ్డి విరుస్తున్నారని విమర్శించారు. ఇటువంటి కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్రంలోని టీడీపీ, జనసేన పార్టీలు కొమ్ముకాస్తుండడం దారుణమన్నారు. రాష్ట్రంలో విద్యుత్ చార్జీలు, దేశంలో గ్యాస్ ధరల పెంపు.. ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయన్నారు. ఇప్పటికైనా పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలని కోరారు.



బొబ్బిలిరూరల్: గ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

కార్యక్రమంలో జి.శంకరరావు, జి.గౌరి, ఎం.పద్మ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్: పెంచిన వంటగ్యాస్ ధరలు తగ్గించాలని కోరుతూ సీపీఎం నాయకులు.. మండలంలోని జె.రంగరాయపురంలో మంగళవారం ఆందోళన చేపట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల కొనుగోలు శక్తి పడిపోయేలా చేస్తున్నాయని సీపీఎం మండల కన్వీనర్ జి.గోపాలం విమర్శించారు. కార్యక్రమంలో ఆ పార్టీ కార్యదర్శి రెడ్డి త్రినాధ, తులసమ్మ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు



మాట్లాడుతున్న లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు దామోదరావు

బొబ్బిలి: జిల్లాలో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయని లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆకుల దామోదరరావు అన్నారు. ఇదే విషయమై ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ఏడాదిలో రూ.30 వేల కోట్లకు పైగా విలువైన మద్యం అమ్ముడుపోయిందన్నారు. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో.. ఇప్పటి కూటమి ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం అమ్మకాలు పోల్చి చూస్తే కూటమి హయాంలోనే 9.1 శాతం మద్యం విక్రయాలు జరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయన్నారు. మద్యం బెల్టుషాపులు లేవని ప్రభుత్వం అన్నా.. ఆ షాపుల్లోనే ఎక్కువగా మద్యం అమ్మకాలు జరగుతున్నాయని ఆరోపించారు.

పవన్ పర్యటన వల్లే పరీక్షకు విద్యార్థులు దూరం

బొబ్బిలి: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పర్యటన వల్లే జేఈఈ మెయిన్స్ పరీక్షకు పలువురు విద్యార్థులు దూరమయ్యారని రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేమిరెడ్డి లక్ష్మునాయుడు ఆరోపించారు. ఇదే విషయమై ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. విశాఖ పర్యటనకు డిప్యూటీ సీఎం పవన్ పర్యటనకు వచ్చినప్పుడు విధించిన ట్రాఫిక్ ఆంక్షల కారణంగా 23 మంది విద్యార్థులు పరీక్ష కేంద్రానికి వెళ్లలేకపోయారన్నారు. వారి భవిష్యత్ ఇప్పుడు ఏం కావాలని, దీనికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రస్తుత ఘటనకు కూడా ప్రభుత్వం స్పందించాలన్నారు.

సన్మానం



రంగనాథం దంపంతులను సన్మానిస్తున్న తృప్తి మిత్ర మండలి సభ్యులు

రాజాం సిటీ: రాష్ట్ర ప్రభుత్వంచే ఈ ఏడాది ఉగాది పురస్కారం అందుకున్న రారవే(రాజాం రచయితల వేదిక) నిర్వాహకులు గార రంగనాథం, సీతారత్నం దంపతులను రాజాం..కు చెందిన తృప్తి మిత్ర మండలి సభ్యులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయినులు లాభాన సుజాత, కోరాడ శిరీషలు మాట్లాడుతూ తెలుగు భాషకు, తెలుగు సాహిత్యం అభివృద్ధికి రంగనాథం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైద్యుడు గార రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మండాకురిటిలో ఉచిత వైద్యశిబిరం

సంతకవిటి: మండలంలోని మండాకురిటి గ్రామంలో బుధవారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు భగవాన్ శ్రీసత్యసాయి సేవా సమితి కన్వీనర్ వెంకన్న ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగే ఈ శిబిరంలో నేత్ర సంబంధిత వ్యాధులతో బాధపడే వారి కళ్లను విశాఖపట్నానికి చెందిన శంకర్ ఫౌండేషన్ వైద్యులు తనిఖీ చేసి, అవసరమైన వారికి మందులు అందజేయనున్నారన్నారు. అలాగే శస్త్రచికిత్స చేయాల్సిన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను ఆయన కోరారు.

ఆస్తినష్టం అంచనా



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న రెవెన్యూ సిబ్బంది

బాడంగి: మండలంలోని గొల్లాది గ్రామంలో బొబ్బిలి అప్పలనాయుడుకు చెందిన బెల్లం క్రషర్ ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదానికి గురై పూర్తిగా కాలిపోయింది. వీఆర్‌ఏ ద్వారా ఈ విషయం తెలుసుకున్న హెచ్‌డీటీ ధనం, వీఆర్‌వో సుశీల తదితరులు సంఘటన స్థలాన్ని మంగళవారం పరిశీలించి, రూ.1.5 లక్షల ఆస్తినష్టం జరిగినట్లు అంచనాలు వేశారు. దీనికి సంబంధించి, నివేదిక తయారు చేసి తహసీల్దారుకు అందిస్తామని వారు తెలిపారు.

అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరచాలి

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరచాలని ఎంఈవో త్రినాధరావు సూచించారు. మండలంలోని సింగిరెడ్డివలస ప్రాథమిక పాఠశాలను ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, పాఠశాల రికార్డులు, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యార్థుల హోంవర్కు, చేతిరాత పుస్తకాలు, మధ్యాహ్న భోజనం వంటకాలు పరిశీలించి, పలు సూచనలు చేశారు. విద్యార్థుల చదువుతో పాటు వారి ఆరోగ్యంపైనా దృష్టిసారించాలన్నారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వంటకాలు చేయించాలన్నారు.

పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ అవసరం

రామభద్రపురం: పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ అవసరమని సీఐ కె.నారాయణరావు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ వి.ప్రసాదరావుతో కలిసి మంగళవారం మీడియాతో ఆయన మాట్లాడారు. ఫ్యాషన్ ముసుగులో పడి నేటి యువత, విద్యార్థులంతా చెడు వ్యసనాలకు బానిసలవుతున్నారన్నారు. ముఖ్యంగా స్మార్ట్‌ఫోన్ ద్వారా క్రికెట్ బెట్టింగ్, ఆన్‌లైన్ జూదం వంటి కార్యకలాపాలతో రూ.లక్షలు పోగొట్టుకుని కుటుంబాలను అప్పులపాలు చేస్తున్నారన్నారు. వారిని సన్మార్గంలో నడిపించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనన్నారు.

పేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వండి

ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్లస్థలాలు మంజూరు చేయాలని సీపీఐ నాయకులు కోట అప్పన్న, తాడంగి ఎండుదొర, శ్రావణ్‌కుమార్‌లు డిమాండ్ చేశారు. ఇదే విషయమై బొబ్బిలి తహసీల్దారు కార్యాలయం వద్ద మంగళవారం ఆందోళనకు దిగారు. అధికారంలోకి రాగానే పట్టణాల్లోని పేదలకు 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు 3 సెంట్లు స్థలం ఇస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందని, ఇప్పటివరకు ఆ హామీ నెరవేర్చలేదని విమర్శించారు. ఇప్పటికైనా అర్హులకు ఇళ్లు, ఇళ్లస్థలాలు ఇచ్చే కార్యక్రమం చేపట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గతంలో ఇందిరమ్మ ఇళ్లపట్టాల పంపిణీలో అనర్హులకు ఇళ్లపట్టాలు ఇచ్చారని, దానిపై దర్యాప్తు చేసి అర్హులకు ఇళ్లపట్టాలు అందేలా చూడాలన్నారు. గిరిజనులు సాగు చేస్తున్న అటవీ భూములకు పట్టాలు ఇవ్వాలని, గిరిజన గ్రామాలను సరిహద్దు పంచాయతీల్లో విలీనం చేయాలని కోరారు. అనంతరం కార్యాలయంలో అధికారులెవరూ లేకపోవడం, కార్యాలయానికి తాళం వేసి ఉండడంతో ఆ తలుపు దగ్గరే వినతిపత్రం ప్రదర్శించారు.

– బొబ్బిలిరూరల్



ఇలా ఉంటే.. ఎలా వెళ్లాలి?

ఈ చిత్రంలో కనిస్తోంది.. రామభద్రపురం సచివాలయం–3 పరిధిలోని రైతు సేవా కేంద్రానికి సంబంధించిన మరుగుదొడ్లు. ఇక్కడి మరుగుదొడ్లు చుట్టూ దట్టమైన ముళ్లపొదలు, డొంకలు, తుప్పలు, పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి ఉన్నాయి. దీంతో మరుగుదొడ్లకు వెళ్లేందుకు కనీసం దారి లేకుండా పోయింది. పోనీ ఆ పిచ్చిమొక్కల మధ్య వెళదామంటే ఏ పామో.. విషపురుగో కరుస్తుందని సిబ్బంది భయపడుతున్నారు. రూ.వేలకు వేలు పెట్టి నిర్మించిన వాటిని ఇలా నిర్లక్ష్యం చేస్తే ఎలా అని అందరూ ప్రశ్నిస్తున్నారు. తక్షమే అక్కడి పరిసరాలను బాగు చేయించి, మరుగుదొడ్లు వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

– రామభద్రపురం



సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమబాట పడతాం..

ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమబాట పడతామని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎం.బలరాంనాయుడు హెచ్చరించారు. ఇదే విషయమై ఆయన రామభద్రపురంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబరు వెంకటనాయుడుతో కలిసి మంగళవారం మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు 10 నెలలు కావస్తున్నా ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టడం లేదన్నారు. 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించాలని, పీఆర్‌సీ అమలయ్యే లోపు 30 శాతం ఐఆర్ ప్రకటించాలని, జీపీఎఫ్, ఏపీజీఎల్‌ఐసీ, సరెండర్ లీవుల బకాయిల చెల్లింపులతో పాటు 11వ పీఆర్సీ, డీఏ బకాయిలు చెల్లించేందుకు రోడ్డు మ్యాప్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ మెమో 57 ప్రకారం సెప్టెంబరు 2004కు ముందు విధుల్లో చేరిన ఉద్యోగులకు పాతపెన్షన్ విధానం అమలు చేయాలని, రిటైర్డ్ ఉద్యోగులకు గ్రాట్యుటీ, పెన్షనరీ బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. అలాగే జీవో నంబరు 117ను రద్దు చేసి, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మాత్రమే తల్లికి వందనం పథకం వర్తింపజేయాలని కోరారు.

– రామభద్రపురం



గోగు సాగుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త చిట్టిబాబు

తెర్లాం: గోగుపంట సాగుపై దృష్టి సారించాలని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ చిట్టిబాబు రైతులకు సూచించారు. మండలంలోని ఆమిటి గ్రామ రైతు సేవా కేంద్రంలో ఆచార్య ఎన్జీ రంగా యూనివర్సిటీ, జూట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా గోగుపంట సాగుపై రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. గతంలో అధిక విస్తీర్ణంలో గోగుపంటను రైతులు సాగుచేసే వారని, ప్రస్తుతం ఆ పంటను సాగు చేసేందుకు రైతులెవరూ ముందుకు రావడం లేదన్నారు. ప్రస్తుత కాలంలో పాలిథిన్ కవర్లను ప్రభుత్వం నిషేధిస్తోందని, దీంతో మళ్లీ జూట్‌తో తయారయ్యే సంచులకు అధిక ప్రాధాన్యం కలగనుందన్నారు. రైతులు గోగుపంట సాగుచేస్తే జూట్ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వం గోగునారను కొనుగోలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో జ్యూట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ ప్రబంధకులు అరుణ్, ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ యూనివర్సిటీ శాస్త్రవేత్త డాక్టర్ సంధ్యారాణి, డీఏఏటీసీ సమన్వయకర్త డాక్టర్ కె.లక్ష్మణ్, మండల ఏవో సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

‘రౌండ్ టేబుల్ సమావేశం’



సమావేశంలో వివిధ సంఘాల నాయకులు

బొబ్బిలి: స్థానిక షాదీఖానాలో లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో వక్ఫ్ సవరణ బిల్లుపై రౌండ్ టేబుల్ సమావేశం మంగళవారం జరిగింది. యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కె.విజయగౌరి, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పి.శంకరరావులు ఈ సమావేశానికి హాజరై, వక్ఫ్ బోర్డు చట్టం సవరణపై కేంద్రం అనుసరిస్తున్న వైఖరిని వ్యతిరేకించారు. ముస్లింల ఆస్తులకు పరిరక్షణ లేకుండా రాజ్యాంగానికి విరుద్ధంగా చట్టం సవరిస్తున్నారని విమర్శించారు. లౌకిక దేశమైన మనదేశంలో మతపరమైన సంస్థల జోలికి వీలైనంతవరకు వెళ్లకపోవడం మంచిదని హితవుపలికారు. ముస్లింల మనోభావాలు దెబ్బతినేలా, రాజ్యాంగాన్ని అపహాస్యం చేసేలా కేంద్రం తీరు ఉందని దుయ్యబట్టారు. దేశంలోని 30 వక్ఫ్‌బోర్డులపై ఇతర సంస్థలు, అధికారులకు పెత్తనం ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. లక్షా 20 వేల కోట్ల ఆస్తులున్న వక్ఫ్ బోర్డులపై ఇతరుల అజమాయిషీ ఇవ్వడాన్ని మతపరమైన కుట్రగానే భావించాల్సి ఉంటుందన్నారు. తక్షణమే వక్ఫ్ సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సంక్షిప్తంగా..

పక్కాగా పౌష్టికాహార పక్షోత్సవాలు

బాడంగి: పక్కాగా పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించాలని ఐసీడీఎస్ పీవో కె.రాజ్యలక్ష్మి సూచించారు. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో తెర్లాం, బాడంగి మండలాల అంగన్‌వాడీ సిబ్బందితో మంగళవారం సమావేశమైన ఆమె.. 15 రోజుల పాటు ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార పక్షోత్సవాలు జరగాలని, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహార ప్రయోజనాలను వివరించాలని తెలిపారు.

13న గురుకుల ప్రవేశ పరీక్ష

బాడంగి: స్థానిక అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఈ నెల 13వ తేదీన పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పి.నారాయణరావు ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. అదే రోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆరో తరగతి ప్రవేశ పరీక్ష, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఇంటర్మీడియట్ ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

ఉద్యోగాలకు 38 మంది ఎంపిక

బొబ్బిలి: స్థానిక రాజా కాలేజీలో ఎంఎస్ఎన్ ల్యాబ్స్ సంస్థ మంగళవారం నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో 38 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ చల్లా వీరేంద్రకుమార్ తెలిపారు. విద్యార్థుల ప్రతిభ ఆధారంగానే ఈ ఎంపికలు జరిగాయన్నారు.

ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

రాజాం సిటీ: సచివాలయాల ద్వారా అందిస్తున్న ఆధార్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు కోరారు. మండలంలోని రాజయ్యపేటలో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఆధార్‌లో తప్పులు లేకుండా చూడాలని, అలాగే 0–6 ఏళ్ల వయసు చిన్నారులకు కొత్త ఆధార్, అప్‌డేషన్ వంటివి చేయాలన్నారు.